క్లుప్తంగా

నేడు 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరి దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

ధర్మవరం కవికి కళావేదిక అవార్డు



యువకవి దోరణాల గురు కాశీవిశ్వనాథ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ధర్మవరానికి చెందిన యువకవి దోరణాల గురు కాశీ విశ్వనాథ్‌కు శ్రీశ్రీ కళావేదిక అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలో శ్రీశ్రీ కళావేదిక వారు 127వ జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం యువకవి దోరణాల గురు కాశీవిశ్వనాథ్ 'సరైన నాయకుణ్ణి ఎన్నుకో' అనే కవిత చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ యువకవికి శ్రీకళావేదిక అవార్డును అందించి శాలువాలతో సత్కరించారు. తనకు అవార్డు రావడం ఆనందంగా ఉందని యువకవి తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తాడిమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

కుల గణన సర్వే వేగవంతం చేయండి



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు, వలంటీర్లు

తలుపుల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను మండలంలో వేగవంతం చేయాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, తహసీల్దార్ శ్రీధర్ అధికారులు, వలంటీర్లకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల్లో జరుగుతున్న కుల గణన సర్వేను పర్యవేక్షించారు. ఈనెల 28 లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, వీఆర్ఓలు మోహన్, ముంతాజ్, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

పెనుకొండ: మండల పరిధిలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమాదేవి అనే మహిళ ఆదివారం గాయపడింది. సోమందేపల్లిలోని సాయినగర్‌కు చెందిన ఉమాదేవి కుటుంబీకులతో కలసి ద్విచక్ర వాహనంలో ఎర్రమంచికి వెళ్తుండగా వెంకటరెడ్డిపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద వాహనం అదుపు తప్పింది. ఉమాదేవి తలకు బలమైన గాయాలు కావడంతో అనంతపురానికి తరలించారు.

చెరువులకు త్వరలో కృష్ణాజలాలు



కాలువ పనులను చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: మండలంలోని మూడు చెరువులకు హంద్రీనీవా కాలువ నుంచి త్వరలో కృష్ణా జలాలు చేరుతాయని మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పాలవాయి, ఎం.చెర్లోపల్లి, మరూరు చెరువులకు నీటిని నింపేందుకు జేసీబీతో కనగానపల్లి మండలంలోని మారెమ్మ గుడి దగ్గర నూతన కాలువ పనులను చేయించారు. వారు మాట్లాడుతూ పాలవాయి, ఎం.చెర్లోపల్లి, మరూరు గ్రామా చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు నింపేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సొంత నిధులు రూ.50 లక్షలు వెచ్చించారన్నారు. మరో 10 రోజుల్లో చెరువులకు కృష్ణా జలాలను నింపుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలవాయి లక్ష్మీనారాయణ, రామచంద్రారెడ్డి, మాచిరెడ్డి చెన్నారెడ్డి, బుడగ నాగరాజు, బాద పల్లయ్య, వలంటీర్లు మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి

- సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- టీడీపీ నుంచి 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 8వ వార్డు టీడీపీ నాయకులు



36వ వార్డులో 50 కుటుంబాలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని 36వ వార్డు, 8వ వార్డు, 9వ వార్డులకు చెందిన 150 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సీఎం జగన్‌తోనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అలాగే పట్టణంలో 8వ వార్డు కౌన్సిలర్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన చేనేత కుటుంబాలు కేతిరెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలోకి చేరిన వారిలో దాసరి రామాంజనేయులు, శీలా లక్ష్మీనారాయణ, గుండా నారాయణ స్వామి, పల్లా వెంకట చలపతి, గుద్దిటి రవీంద్ర, పల్లా జయరాములు, పల్లా రమేష్, గుర్రం ఆంజనేయులు, గుద్దిటి ఆదినారాయణతో పాటు 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్ పాల్గొన్నారు.

36వ వార్డు నుంచి 50 కుటుంబాలు చేరిక

వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి శ్రీనివాసులు, షేక్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని 36వ వార్డులో టీడీపీ నుంచి 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పెద్దిరెడ్డి రవి, జీవన్, సింహాద్రి, అజయ్, ఆనంద్, బాలాజీ, నాగరాజు, వేల్పుల జయలక్ష్మి, అఖిల, పార్వతి తదితరులు ఉన్నారు. కేతిరెడ్డి వారందరికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్, కౌన్సిలర్ చింతా యల్లయ్య, బడన్నపల్లి కేశవరెడ్డి, మైనార్టీ నాయకులు హిదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డు నుంచి 40 కుటుంబాలు..

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మాసపల్లి సాయి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని 9వ వార్డులో 40 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఆదెప్ప, నరసింహులు, భూషణ, వెంకటేశ్, శివ, వీరప్పలతో పాటు 40 కుటుంబాల వారు ఉన్నారు. కేతిరెడ్డి వీరందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికో, పట్టణంలో ఇద్దరో ముగ్గురో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూరిందన్నారు. పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి దాకా రూ.5 వేల కోట్ల దాకా ఖర్చు పెట్టి అభివృద్ధి చేశామని వెల్లడించారు. రూ.3 వేల కోట్లకు పైగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. గత టీడీపీ హయాంలో ఏ ఒక్క నియోజకవర్గంలోనైన ఇంత అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. ప్రజల మద్దతుతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జెన్నే సూరి, గొట్లూరు రాజు, కుమార్, మంజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి



పోట్లమర్రి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: ప్రజలు గొడవలకు దూరంగా ఉంటూ, ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండలంలోని పోట్లమర్రి, వేల్పుమడుగు గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. గుట్కా, మద్యం విక్రయించేవారి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. రౌడీ షీటర్లు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అందరూ సహకరించాలన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు, పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం విక్రయించే వారి వివరాలను అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్‌ఐ సోమశేఖర్ మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూజలకు ముస్తాబైన ఆలయాలు



పోట్లమర్రి ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానానికి ఏర్పాటు చేసిన షామియానా

బత్తలపల్లి: అయోధ్యలో బాల రాముడి దివ్య ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాల్లో పూజలు చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మండలంలోని బత్తలపల్లి, పోట్లమర్రి, రాఘవంపల్లి, గుమ్మల్లకుంట, వేల్పుమడుగు, మాల్యవంతం, జలాలపురం, అప్పరాచెరువు, కాటమకుంట తదితర గ్రామాల్లో ఆలయాలను ఇప్పటికే సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. గంగపూజ, కలశ పూజ, మహాగణపతి పూజ, పుణ్యాహుతి, శ్రీరాముల వారికి అభిషేకములు, అర్చనలు చేస్తామని అర్చకులు తెలిపారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ముగియగానే మహామంగళహారతి ఇస్తామన్నారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు తోరణాలు కట్టుకుని, వేడుకల్లో పాల్గొనాలని సమరసతా సేవా ఫౌండేషన్ మండల అధ్యక్షుడు సాకే గోపాల్, షరాబ్ యోగానంద ఆచారీ పేర్కొన్నారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత ఇంటి ముందు ముగ్గులు వేసి ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో అఖండ రామభజన

హిందూపురం: అయోధ్యలో రామమందిరంలో రామవిగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని సత్యనారాయణపేట శేషసాయి మందిరంలో ఆదివారం అఖండా రామభజన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.

లేపాక్షి: అయోధ్య రామాలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కల్లూరు, పులమతి రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులమతిలో వెలిసిన వీరాంజనేయస్వామి దేవాలయంలో కొత్తగా సీతా సమేత రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలు ప్రతిష్టించడానికి భక్తులు సుమారు రూ. 2 లక్షలు విరాళాలు అందజేసారు. అలాగే పి.సడ్లపల్లికి చెందిన తిమ్మయ్య దేవాలయానికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు.

పెనుకొండ: మండలంలోని చిన్నపరెడ్డిపల్లిలో ఆదివారం నూతనంగా నిర్మించిన సీతారామ సమేత అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పూజలు నిర్వహించినట్లు పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాది నాగరాజు, లీలావతి దంపతులు తెలిపారు.

అమరాపురం: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమరాపురం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో శాంతి హోమం నిర్వహించారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



అప్పరాచెరువులో కొలువుదీరిన సీతారాములు



బత్తలపల్లి మండలం అప్పరాచెరువులో అన్నదానం చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల దేవాలయ పునఃప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా శనివారం, ఆదివారం సీతారాముల విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలశస్థాపన, విగ్రహ ఊరేగింపు, ఆయుష్య, నవగ్రహ, వాస్తు హోమాలు, ధాన్యాధివాసం, శయ్యాధివాసం తదితర కార్యక్రమాలను అర్చకులు జయకుమార్, ఫణీంద్ర, భాను చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు సీతారాముల విగ్రహ ప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి, దివ్య దర్శన, మంత్ర పుష్ప మహా నివేదన మహామంగళహారతి ఇచ్చారు. కుంభ తీర్థ వినియోగం అనంతోషోడశ, మహాదానాలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. 12 గంటలు నుంచి సాయంత్ర 5 గంటల వరకూ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. ప్రతిష్ట అనంతరం రాత్రి వరకూ భక్తులకు స్వామి దర్శనం భాగ్యం కల్పించారు. రెండు రోజులు పాటు భజన కార్యక్రమాలు నిర్వహించారు.



ధర్మవరం అర్బన్: గోదా రంగనాయకుల కల్యాణం జరిపిస్తున్న శ్రీరామ భజన మందిరం కమిటీ సభ్యులు

గోదా రంగనాయకుల కల్యాణం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తేరుబజార్‌లోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం శ్రీరామ భజన మందిరం కమిటీ ఆధ్వర్యంలో గోదా రంగనాయకుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులు కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీరామ భజన మందిరం నిర్వాహకులు దేవతా కృష్ణమూర్తి, కోటి లక్ష్మీవేంకటేశ్వర్లు, జయంతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బాషావలి షా దర్గా



కొడిమి బాషావలి షా దర్గా

రాప్తాడురూరల్: మత సామరస్యానికి ప్రతీకగా అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామ శివారులో బాషావలి షా దర్గా నిలుస్తోంది. ఈనెల 25 నుంచి గంధం ఉరుసు ప్రారంభం కానుంది. సుమారు 700 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ దర్గా మరుగున పడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోని సమయంలో నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన హజరత్ సయ్యద్ అహ్మద్ బాదుషా ఖాద్రీ స్వామి ఆధ్వర్యంలో కొడిమి బాషావలి దర్గా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం హజరత్ సయ్యద్ అహ్మద్ బాద్‌షా ఖాద్రీస్వామి కుమారుడు సద్గురు డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్ షా ఖాద్రి నేతృత్వంలో ఈ దర్గా దినదినాభివృద్ధి చెందుతోంది. రాయలసీమ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు ఈ దర్గాను సందర్శించి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఏటా హిందూ, ముస్లింలు దర్గా గంధం ఉరుసు ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ. దర్గా సమాధిపై ఉన్న వేపచెట్టు ఆకు సర్వరోగ నివారిణిగా భక్తుల్లో విశ్వాసాన్ని నింపుతోంది. చరిత్ర ఉన్న ఈ దర్గాను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఇటీవల సందర్శించి, ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పించడానికి, దర్గా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు.

25న ఉరుసు ఉత్సవం..

ఈనెల 25న సాయంత్రం 5 గంటల నుంచి గంధం - ఉరుసు ఉత్సవం ప్రారంభమవుతుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. దర్గా ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఉరుసు ఉత్సవాల్లో పలు ఆధ్యాత్మిక సందేశాలు, ఫకీర్ల జల్సాలు, అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

హిందూపురం: ఉపాధ్యాయులకు సంబంధించి అన్ని రకాల సేవలు ఉచితంగా అందజేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు పక్కన ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉద్యోగపరమైన వివిధ సందేహాలు, సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించడానికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ అధ్యక్షుడు నరసింహులు, సీనియర్ నాయకులు లక్ష్మీపతి, ముస్తాక్‌తో పాటు కమిటీ నాయకులు మారుతి, బాబు, మహంతి, చెన్నకేశవులు, శ్రీనివాసులు, అనిల్, రామకృష్ణ, నాసీర్, క్షీరలింగేశ్వర, నంజప్ప తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామంలో ఆదివారం మట్కా రాస్తున్న వీరేష్, శ్రీనివాసరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ లావణ్య తెలిపారు. మరో ఇద్దరు కరిదాసనపల్లికి చెందిన ముద్దప్ప, మధూడికి చెందిన గోపీనాథ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. పట్టుబడిన వారి నుంచి రూ.7 వేల నగదుతో పాటు మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓల నియామకం

మడకశిర: మడకశిర, అగళి మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓ-1లను నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. మడకశిర ఇన్‌చార్జ్ ఎంఈఓ-1గా పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణప్ప, అగళి ఇన్‌చార్జ్ ఎంఈఓ-1గా పరిగి ఎంఈఓ-1 లక్ష్మీదేవిని నియమించినట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాలల్లో అభయ నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఎంఈఓ గంగప్ప, పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ అభయ నిస్వార్థ ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సాకే నరేంద్ర (ఫైల్)

తాడిమర్రి: మండల పరిధిలోని మోదుగులకుంటలో నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడిన సాకే గంగాధర్ కుమారుడు సాకే నరేంద్ర (22) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోదుగులకంట గ్రామానికి చెందిన సాకే సుదర్శన్, సాకే నరేంద్ర మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంలో తాడిమర్రికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో మోదుగులకంట సమీపంలోని పోతులయ్య స్వామి ఆలయం వద్ద ముందు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. ఈ సంఘటనలో సుదర్శన్ మృతి చెందగా సాకే నరేంద్ర తీవ్రంగా గాయపడిన విషయం విధితమే. అయితే నాలుగు రోజులుగా అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ గంగావతి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

నేటి పాదయాత్ర షెడ్యూల్

అమడగూరు: నియోజకవర్గ పరిధిలోని 193 చెరువులకు నీటిని నింపే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేపట్టిన రైతు విజయ సంకల్ప పాదయాత్ర సోమవారం కొనసాగనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పార్టీ కార్యాలయవర్గాలు తెలియజేశాయి. అమడగూరులో ప్రారంభమయ్యే పాదయాత్ర గాజులపల్లి, దిన్నమీదపల్లి క్రాస్, పేరంవాండ్లపల్లి క్వార్టర్స్, కొలిమిరాళ్లపల్లి క్రాస్, కొత్తూరు, చెర్లోపల్లి, కస్సముద్రం, మహమ్మదాబాద్‌తో అమడగూరు మండలంలో ముగియనుంది. తర్వాత ఓడీచెరువు మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్, సున్నంపల్లి క్రాస్, రామయ్యపేట, చౌడేపల్లి క్రాస్, దాదిరెడ్డిపల్లి క్రాస్, గౌరాపురం, బాలప్పగారిపల్లి గ్రామాల వరకూ సాగనుంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజలు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



జయప్ప (ఫైల్)

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామానికి చెందిన రైతు జయప్ప (64) అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాలు.. జయప్ప తనకున్న 5 ఎకరాల పొలంలో వేరుశనగ, టమాట సాగు చేశాడు. పంటల సాగుకు రూ.5 లక్షల వరకూ అప్పు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురయ్యేవాడు. ఈనెల 19న పొలంలోనే విషద్రావకం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉమ్మడి జిల్లా వాసులేగాక, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ముత్యాలమ్మకు కానుకలు సమర్పించారు. ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్రవా రాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.